www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 31 ఆగస్టు 2023
5
అన్నమయ్య



మహిళలు జాగరూకతతో వ్యవహరించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహిళలు ప్రస్తుత సమాజంలో జాగరూకతతో వ్యవహరించాలని పియర్స్ పియర్స్ సేవా సంస్థ అధ్యక్షులు పసల చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సును స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వాక్ ఫర్ ఫ్రీడమ్-మూమెంట్ ఇండియా కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్వశక్తితో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, అన్యవ్యక్తులతో జాగరూకతతో మసలుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరి మాట్లాడుతూ లోకం పోకడ తెలుసుకొని మసలుకోవాలి, అపరిచితులు నమ్మరాదని మనలను మనమే రక్షించుకోవాలని మార్గదర్శనం చేశారు. గ్రామ జ్యోతి సొసైటీ అధ్యక్షురాలు బండపల్లి సుభద్ర మాట్లాడుతూ అక్రమ రవాణా ద్వారా అమ్మాయిలను కిడ్నాప్ చేసి అక్రమ నిర్బంధంలో ఉంచి, బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి దించడం, అబ్బాయిలను అవయవదానం కోసం ఉపయోగిస్తున్నారన్నారు. ఒకటవ పట్టణ పోలీస్ షీ టీమ్ సభ్యులు మాట్లాడుతూ బాల్య వివాహలను, బాలికలపై ఇతర అరాచకాలను ఆపడం కేవలం అమ్మాయిల ఆలోచనా శక్తిపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. యువశక్తి ఫౌండేషన్ డైరెక్టర్ కలిచెట్ల రెడ్డి గణేష్ మాట్లాడుతూ చైతన్యం మనలో ఉన్న పరిజ్ఞానం మేలుకొలుపుకు నాంది కావాలన్నారు.

ప్రజలపై భారాలు మోపడం తగదు : సిపిఎం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ ఆర్టీసీ ఛార్జీల భారాలతో ప్రజలను దోచుకుతింటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు సరికాదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి.రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక చిట్వేల్ ఆటో స్టాండ్ వద్ద సిపిఎం సమరభేరి పోస్టర్‌లను ఆటో కార్మికులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ కేంద్రం విధిస్తున్న షరతులకు తలొగ్గి రాష్ట్రం ఇష్టం వచ్చినట్లు భారాలు మోపుతోందన్నారు. ప్రపంచ బ్యాంకు షరతులను కేంద్రం అమలు చేస్తూ రాష్ట్రాలపైనా రుద్దుతోందని చెప్పారు. రాష్ట్రం కూడా అప్పుల కోసం కేంద్రం విధించిన షరతులన్నీ అమలు చేస్తోందని, దీనివల్ల సామాన్య ప్రజలపై మోయలేని భారాలు పడుతున్నాయని తెలిపారు. విద్యుత్ ఛార్జీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తోందని, గతంలో రూ.250 బిల్లు వస్తే ఇప్పుడు రూ.500 వస్తోందని, అంటే బిల్లు 100 శాతం పెరిగిందన్నారు. ఇంత పెద్ద ఎత్తున భారాలు పడుతుండటంతో పరిశ్రమలు కూడా మూతబడుతున్నాయని తెలిపారు. ఇవి చాలదన్నట్లు వ్యవసాయ మోటార్లకు, ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. ట్రూఅప్, ఫ్యూయల్ సర్‌ఛార్జి పేరుతో ఎప్పుడో వాడుకున్న విద్యుత్‌కు ఇప్పుడు భారాలు వేస్తున్నారని, అద్దె ఇళ్లలో ఉండే సామాన్యులకు ఇది పెనుభారంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా చేసిన ఆందోళనలను, ఆయన తండ్రి రాజశేఖరరెడ్డి చేసిన దీక్షలను గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే తన సొంత కంపెనీలకే వాటాలు కట్టబెడుతూ దోచుకుంటున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లను అదానీ కంపెనీల నుండి కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. అధిక ధరలకు, ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా 30వ తేదీ నుండి సెప్టెంబరు నాలుగోతేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ నెల 30, 31 తేదీల్లో ప్రచారం, సంతకాల సేకరణ, ఒకటోతేదీన సచివాలయాల్లో వినతిపత్రాలు సమర్పిస్తామని, నాలుగోతేదీన అన్ని మండల కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడతామని తెలియజేశార. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ప్రజా ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. అనంతరం పాతబస్టాండ్, చిట్వేలు రూట్‌లోని ప్రతి ఇంటికి, ప్రజలకు, వాహనదారులకు, టైలర్లకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, సిపిఎం నాయకులు వెంకటేష్, సిద్దూ, ఆసిఫ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

చిన్నారులను తప్పక బడిలో చేర్పించాలి : గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

5-18 ఏళ్ల మధ్య వయసు ఉన్న చిన్నారులను తప్పక బడిలో చేర్పించాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోపై మండల స్పెషల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ పరిధిలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో సర్వే 100 శాతం పూర్తి చేయాలన్నారు. 5 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు ఉన్న చిన్నారులను కచ్చితంగా బడిలో చేరేలా చూడాలని, ఇందుకోసం మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. బడి బయట ఎవరు ఉండకూడదనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోందని, ఇందులో భాగంగా పాఠశాలల్లో తొమ్మిది రకాల మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసిందన్నారు. విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్, షూ, బ్యాగు, బెల్ట్ అందజేశారన్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన లాంటి పథకాలు అమలు చేసి, అన్ని రకాల వసతులను పాఠశాలల్లో కల్పిస్తున్నారని చెప్పారు. ప్రతి విద్యార్థి పాఠశాలలకు వెళ్లి మంచి పౌరులుగా ఎదిగేటట్లు చూడాలన్నారు. 10వ తరగతి, ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులను మరల తిరిగి పాఠశాలల్లో, కళాశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వీరికి అమ్మఒడి పథకం వస్తుందనే విషయాన్ని తెలియచేయాలని, ఒక వేళ వారు చేరకపోతే ఓపెన్ స్కూల్ లోనైనా చేర్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎంఇఒలు పూర్తి స్థాయిలో వాలంటీర్లను సమన్వయం చేసుకొని వంద శాతం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పూర్తి చేయాలన్నారు. ఎంఇఒలు వారి పరిధిలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ లేని గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిఇఒ కృష్ణయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, మండల స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష


అధికారంలోకి వస్తే ఆరు సూత్రాలు అమలు : పిసిసి



తులసిరెడ్డికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

వైసిపి, టిడిపి మేనిఫెస్టోలు కాంగ్రెస్ మేనిఫెస్టోకు ఏమాత్రం సరికావని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ ఎన్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలోమాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఆరు సూత్రాలు కార్యక్రమం అమలవుతాయని అన్నారు. రాష్ట్రంలో రైతన్నలు వ్యవసాయం గిట్టుబాటు కాక అప్పుల ఊబిలో కూరుకుపోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ జాతీయస్థాయిలో రైతులు ఆత్మహత్యల మూడో స్థానంలో కౌలు రైతులు ఆత్మహత్యలు రెండో స్థానంలో ఉందని ఆయన అన్నారు. అప్పుల ఊబి నుంచి బయట పడాలంటే రూ. 6 లక్షల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ చేయడం జరుగుతుందన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర బేరల్ 140 డాలర్లు ఉన్నప్పుడు కూడా దేశంలో వంటగ్యాస్ సిలిండర్ ధర. రూ. 420 లకే సరఫరా చేసిందని చెప్పారు. ప్రస్తుతం ముడిచమురు ధర గణనీయంగా తగ్గినప్పటికీ వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.1200 కు పెరిగిందని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తుందని చెప్పారు. ప్రతి నిరుపేద కుటుంబానికి నెలకు రూ. 6 వేలు, ఐదు సంవత్సరాలకు రూ. 3. 60 లక్షల ఆర్థిక సాయం అందుతుందన్నారు. రాష్ట్రంలో సంజీవని లాంటి ప్రత్యేకహోదా అమలవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా కోడూరు నియోజకవర్గం కన్వీనర్ ఎస్ అల్లా బకస్ సీఎల్పీ మాట్లాడుతూ వైసిపి,టిడిపి పార్టీలు మేనిఫెస్టోలో అమల్లో అదనపు ఆర్థిక భారం రాష్ట్ర ప్రభుత్వం మోయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎండి గౌస్, చెన్న కృష్ణ, ఫరూక్, వెంకటేష్, ఖదీర్, ఖాదర్‌బాషా, అమీర్, ఉత్తన్న కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు



ఆంజనేయులు దంపతులను సన్మానిస్తున్న నాయకులు

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-రాయచోటి

ఆంజనేయులకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం గర్వకారణమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం కె.రామాపురంలోని ఆంజనేయులు స్వగృహంలో ఆయనను టిటిడి మాజీ పాలకమండలి సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి పట్టణం మాసాపేట ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఆంజనేయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం హర్షణీయమని పేర్కొన్నారు. 32 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఆంజనేయులు విన్నూత్న రీతిలో విద్యాబోధన, ఆహ్లాదకర వాతా వరణంలో పాఠాలు నేర్పించడం, సొంత డబ్బులు వ్యయం చేసి పాఠశాలలో ల్యాబ్ ఏర్పాటు చేసి విద్యార్థులకు పాఠాలను బోధించడం, మట్టితో పర్యావరణ అనుకూల వస్తువులును విద్యార్థుల చేత చేయించడం అభినందనీయం, ఆదర్శనీయమని పేర్కొన్నారు. రాయచోటిని విద్యా రంగంలో తీర్చిదిద్దడానికి ఇలాంటి ఉత్తమ ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులును ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. 2012 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉత్తమ ప్రభుత్వ పాఠ్య పుస్తక రచయితగా, 2016 సంవత్సరంలో ఉమ్మడి కడప జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందారు. 2019వ సంవత్సరంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆంజనేయులు ఆనందం వ్యక్తం చేశారు. రాబోవు మూడు సంవత్సరాల కాలంలో ఎంతోమంది ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంగా ప్రయత్నం సాగిస్తామన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టిడిపి ఉపా ధ్యక్షులు గుర్రం సుబ్బయ్య నాయుడు, రాజేంద్ర నాయుడు, లాయర్ సతీష్ కుమార్‌రెడ్డి, సురేష్, దేరంగుల రామచంద్ర, వెంకటరమణ, ఆది, సుబ్బరా యుడు, విశ్రాంతి ఉపాధ్యాయులు వెంకటరమణ, రెడ్డన్న, రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.



బద్వేలు : సంతకాల సేకరణలో పాల్గొన్న ఎం.ఎ.గఫూర్

ఎన్నికల ఎత్తుగడ కోసమే గ్యాస్ ధర తగ్గింపు

ప్రజాశక్తి - బద్వేలు/కడప అర్బన్

గ్యాస్ సిలిండర్ ధరలు నాలుగేళ్లలో ఎనిమిది సార్లు పెంచి ఒక్కసారిగా రూ.200 తగ్గించడం ఐదు రాష్ట్రాల ఎన్నికల ఎత్తుగడేనని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ అన్నారు. బుధవారం బద్వేలు, కడపలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ గ్యాస్ సిలిండర్ ధర తగ్గించి మహిళలపై మోడీ కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని, సబ్సిడీలకు కోత బెట్టి సిలిండర్ రూ.800 ధర పెంచి లక్షలాది కోట్ల రూపాయలు భారం మోపి నేడు ధర కొద్దిగా తగ్గించి ప్రజలను వంచిస్తున్నారని విమర్శించారు. ప్రజా ఆందోళన ఒత్తిడి మేరకు ప్రభుత్వం గాస్ ధర కొద్ది మేరకైనా తగ్గించక తప్పలేదని పేర్కొన్నారు. వంద రోజుల్లో ధరలు తగ్గిస్తానని 2014లో హామీ ఇచ్చిన బిజెపి ప్రభుతం ప్రజలకు నమ్మకద్రోహం చేసిందన్నారు. అదానీ, అంబానీ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ధరలు పెంచి దేశ ప్రజలను బలి చేశారని తెలిపారు. దేశాన్ని అప్పుల ఊబిలో దించారన్నారు. కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ సంస్కరణల పేరుతోప్రజల నడ్డి విరుస్తున్నారని చెప్పారు. వైసిపి సర్కార్ పేదల ప్రభుత్వంగా చెబుతూ ధరలు, పన్నులు పెంచి ప్రజల గొంతు కోస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రానికి లొంగిపోయి ఆంధ్రప్రదేశ్ ను బలిచేస్తున్నదని, విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తానని నమ్మబలికి నేడు సర్దుబాటు చార్జీల పేరుతో భారాలు వేయటం మోసపూరితమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, నగర కార్యదర్శి రామమోహన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, శ్రీనివాసులురెడ్డి, కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, పాపిరెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, ఓబులేసు, జమీల, షకీల, రామకృష్ణారెడ్డి, ఎం.ఆర్.నాయక్ పాల్గొన్నారు.

సాగు లేనట్టేనా?

- భూములన్నీ బీళ్లు
- ఖరీఫ్‌లో వింత ధోరణి
- ఆగస్టు చివరి వారానికి సాగు అంతంతే
- జిల్లాలో 82,589 హెక్టార్లలో అంచనా

ప్రజాశక్తి - రాయచోటి

ఖరీఫ్‌లో వింత ధోరణి ఏర్పడి జిల్లా వ్యాప్తంగా ఎక్కువ మొత్తంలో భూములు ఖాళీగా ఉన్నాయి. ఆగస్టు చివరి వారమైనా ఒకవైపు చాలాచోట్ల సేద్యం లేక భూములు బీళ్లుగా ఉన్నాయి. ప్రభుత్వం మరోవైపు సెప్టెంబర్ లోపల అధికారిక రికార్డులలో పంట సాగు ఇ-క్రాప్ బుకింగ్ నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 82,589 హెక్టార్లు. ఇప్పటి వరకు 25,210 హెక్టార్లలో రైతులు సాగు చేశారు. రైతుల విత్తనాలు తీసుకున్నప్పటి నుంచి వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. కనీసం పొలంలో దుక్కి చేసుకోవడానికి కూడా వర్షాలు కురవడం లేదని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో వరి, వేరుశనగ, పత్తి, పప్పు ధాన్యాలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు పంట సేద్యంపై ఆశలు వదులుకున్నారు. సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి రైతులకు ఉత్సాహంగా కనిపించడం లేదు. వేసిన పంట కూడా వర్షాభావం కారణంగా ఎండిపోతున్నాయి. పంటలు సాగు చేయకపోతే ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం, రైతు భరోసాను వెనక్కి ఇచ్చేయాలన్న భావంతో రైతులు ఏదో ఒక పంట వేసి ఇ-క్రాప్ ఇతర రికార్డులను నమోదు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వేరుశనగ గిట్టుబాటుగాక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 60 శాతం పంట సాగు చేయాల్సిందిగా కానీ ప్రస్తుతం 30 శాతం వరకు రైతులు పంట సాగు చేసినట్లు సమాచారం. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. కాగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వం విత్తనాలను అందిస్తోంది. వరి విస్తీర్ణం 9,748 హెక్టార్లు, వేరుశనగ విస్తీర్ణం 47,885 హెక్టార్లు ఉంది. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం సికె నారాయణ రకాలు విత్తనాలు 40 శాతం సబ్సిడీతో అధికారులు రైతులకు అందజేశారు. ఖరీఫ్ వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 47,88 హెక్టార్లు, దాని కనీస మద్దతు ధర రూ.5550 కాగా గత ఏడాది రూ.6500 వరకు పలికింది. ఈ ఏడాది రూ.6,800 నుంచి రూ. 7 వేల వరకు పలుకుతుంది. జాతీయ ఆహార భద్రత పథకం కింద 750 కిట్లు వేరుశనగ, 9,000 కిట్లు కంది, 8000 కిట్లు రాగి, 150 కిట్లు కొర్ర చిరు సంచులను పంపిణీ చేశారు.




వర్షాలు కురవకపోవడంతో బీళ్లుగా మారిన పొలాలు



ఎండిపోతున్న వేరుశనగ పంట

రైతులను ఆదుకోవాలి



జూన్ నుండి వర్షం కోసం ఎదురుచూస్తున్నాం. వేరుశనగ విత్తనాలను తెచ్చుకొని విత్తనాల వేయడానికి సిద్ధం చేసుకున్నాం. కానీ ఇప్పటి వరకు వర్షం కురవలేదు. వర్షం కురిస్తే పంటలు పండి తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరగవుతుంది. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి.

- చంద్రయ్య, రైతు, ఎండపల్లి, రాయచోటి.

కరువు జిల్లాగా ప్రకటించాలి



వ్యవసాయ రంగం నేడు దేశవ్యాప్తంగా సంక్షోభంలో ఉంది. రైతు గౌరవప్రదంగా జీవించగలిగే పరిస్థితులు లేవు. పాలకుల విధానాల కారణంగా రైతులు కౌలు రైతులు గ్రామీణ చేతి వృత్తుదారులు స్థితిగతులు దిగజారి పోతున్నాయి. జిల్లాలో ఖరీఫ్ సీజన్లో వర్షాలు లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అన్నమయ్య జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి.

-సి.రామచంద్ర, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, అన్నమయ్య.

రైతులు ఆందోళన చెందొద్దు



వేరుశనగ పంట వేసిన రైతులు ఒక లీటర్‌కు రెండు గ్రాములు యూరియా కలిపి వేరుశనగ పంటకు స్ప్రే చేయాలి. ఇలా చేయడం వల్ల పంటను దాదాపు పది రోజుల వరకు కాపాడుకోవచ్చు. ఈ లోపల వర్షాలు జిల్లాలో కురుస్తాయి. ఇప్పటి వరకు 50 శాతం ఇ-క్రాప్ నమోదు చేశాం. దెబ్బతిన్న పంటలను పరిశీలించి నివేదికను తయారు చేస్తున్నాం. సెప్టెంబర్ మొదటి వారంలో వర్షాలు పడే అవకాశం ఉంది. కావున రైతులు ఆందోళన చెందవద్దు.

- చంద్రా నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, అన్నమయ్య.

విద్యుత్ ఎఇగా రెడ్డికుమార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణ ఈస్ట్ ట్రాన్స్‌కో ఎఇగా కె.రెడ్డి కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని సిటిఎం నుండి మదనపల్లె టౌన్ ఈస్ట్ సెక్షన్ ఎఇగా బాధ్యతలు తీసుకోవడంతో ట్రాన్స్‌కో అధికారులు, కార్యాలయం సిబ్బంది సన్మానించారు. గతంతో ఈయన మదనపల్లె, తంబళ్లపల్లి నియోజ కవర్గాలలో విధులు నిర్వహించి ప్రజల ఆధరాభిమానాలను చూరగొన్నారు. ఈ సందర్భంగా రెడ్డి కుమార్ మాట్లాడుతూ తాను గతంలో మదనపల్లె టౌన్‌లో బాధ్యతలు నిర్వహించానన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడానికి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.



ఎఇ రెడ్డికుమార్

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

సర్వేంద్రియాం నయనం ప్రధానం అనే సూక్తిని నిజం చేసే విధంగా లయన్స్ క్లబ్ అఫ్ మదనపల్లె, ఆలోక్ ఐ విజన్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 8 మంది ప్రత్యేక కంటి వైద్య నిపుణులు ఆధ్వర్యంలో స్థానిక విజయ భారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి చూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మదనపల్లె లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి అధ్యక్షతన హైస్కూల్ కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు సహకరంతో జరిగిన కంటి పరీక్షల శిబిరంలో హేమలత అండ్ టీమ్ సుమారు 1300 మంది విద్యార్థులకు దృష్టి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరిగింది. సుమారు 200 మంది విద్యార్థులను కంటి అద్దాలకు ఎంపిక చేశారు.అలాగే మరో 80 మంది విద్యార్థులకు విజన్ పరీక్షలు నిర్వహణ కోసం లయన్స్ కంటి ఆసుపత్రికి సిఫారసు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి మాట్లాడుతూ విద్యార్థులకు కంటి చూపు బాగుంటేనే వారి భవిష్యత్తు బాగుటుందని పేర్కొన్నారు. విద్యార్థి దశలో కంటి చూపు సమస్యలు వున్న వారిని గుర్తించి, వారికి పరీక్షలు నిర్వహించి వైద్యం అందించడం కోసం ప్రత్యేకంగా క్యాంపు ఏర్పాటు చేశాయని తెలిపారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్రత్యేకంగా లయన్స్ క్లబ్ కంటి పరీక్షలు శిబిరం ఏర్పాటు చేసి అందరికి పరీక్షలు నిర్వహించడంతోపాటు వారి సమస్యలు గుర్తించి, పరిష్కారం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. లయన్స్ క్లబ్ పిఅర్ఒ గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ విశాల దృక్పథంతో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇలాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు, బిజెపి జాతీయ నాయకులు చల్లపల్లి నరసింహా రెడ్డి, డాక్టర్ అజ్మతుల్లా ఖాన్,లయన్ అరుణ్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

పకడ్బందీగా ఓటర్ల ఇంటింటి సర్వే : కలెక్టర్

ప్రజాశక్తి-వీరబల్లి

ఓటర్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ గిరీష అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని సంగంవాండ్లపల్లి, పెడ్డివీడు పెద్దహరిజనవాడ, రాగిమనుదిన్నెపల్లిలలోని ఓటర్ల జాబితాను పరిసీలించారు. ముఖ్యంగా డెత్ ఓట్లను తీసివేశారా లేదా అని గ్రామాలలోని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ఓటరు సర్వేలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా డెత్ ఓట్లను తొలగించాలన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాను పరిశీలించారు. రెండు ప్రాంతాల్లో ఓటు ఉన్న, చనిపోయిన వారి పేర్లను తొలగించాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి ఓటుకు దరఖాస్తు చేయించాలన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ జాబితాలో తప్పొప్పులను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో తాసిల్దార్ మహేశ్వర్‌రెడ్డి, ఎంపిడిఒ మల్లేశ్వరి, పంచాయతీ సెక్రటరీ చంద్రుడు, విఆర్ఒ కవిత, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి- కలకడ

విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల కేంద్రమైన కలకడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీలు నిర్వహించారు. అనంతరం సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపిని మరింతగా పెంచి ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది హాజరు ల్యాబ్‌ను పరిశీలించినట్లు తెలిపారు. ప్రతి నెల 5 డెలివరీలను స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కోట గుడిబండ పంచాయతీ గొల్లపల్లిలో నిర్వహిస్తున్న 104 సేవలను తనిఖీలు చేశారు.గొల్లపల్లిలో ఎఫ్ పి ఎస్ ద్వారా జరుగుతున్న వైద్య సేవలపై అరాదేసి వైద్య సేవలు గురించి గ్రామస్తులన్నీ అడిగి తెలుసుకున్నారు. 104 సేవలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిరుపేదలకు వరం లాంటిదని సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. గొల్లపల్లిలోనే అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ నిర్వహించి చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్న తీరుపై ఆరా తీసే అంగన్వాడి సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్, కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మల్లికార్జున, మోహన్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్స్ బలరామరాజు, లక్ష్మీనారాయణ, ఎంపిహెచ్ఇఒ వెంకటేశు, హెల్త్ సూపర్వైజర్ రామలక్ష్మమ్మ, స్టాఫ్ నర్స్ భాగ్యలక్ష్మి, అరుణ, ఫార్మసిస్ట్ ఉత్పల, ల్యాబ్ టెక్నీషియన్ హాజిరా పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ కొండయ్య


శ్రీనివాసరాజుకు రాఖీ కడుతున్న జనసేన వీర మహిళ

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని డిఆర్‌డిఎ మాజీ అధికారి ఎల్లటూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. బుధవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలోజనసేన వీర మహి ళలు శ్రీనివాసరాజుకు రాఖీ కట్టి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించి మహిళా సాధి కారత సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. జనసేన పార్టీ మహిళలను ప్రత్యేకంగా గుర్తించి వారి అభ్యున్నతికి పాటుపడుతుందని తెలిపారు. అనంతరం అక్క, చెల్లెళ్ళకు, జనసేన వీర మహిళలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి శ్రీనివాసరాజు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** అన్నా,చెల్లెలి అనుబంధానికి ప్రతీకే రక్షాబంధన్ అని బి.కొత్తకోట ఎస్.ఐ.రామ్మోహన్ పేర్కొన్నారు. రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళా కానిస్టేబుల్ కావ్య ఎస్‌ఐకు రాఖీ కట్టి, స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవన విధానంలో అన్నా, చెల్లెలు అనుబంధం ఎంతో పవిత్రమైందన్నారు.రాఖీ పౌర్ణమి రోజున ప్రతి చెల్లెలు వారి సోదరులకు రాఖీలు కట్టి తమ ప్రేమానురాగాలను పంచుకుంటారన్నారు. **రామాపురం :** అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతి రూపం రక్షా బంధన్ అని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా రామాపురంలో శ్రీకాంత్ రెడ్డికి మహిళలు రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.


నాయకులతో మాట్లాడుతున్న సహదేవరెడ్డి

వైసిపి బలోపేతానికి కృషి చేయండి

ప్రజాశక్తి-కలికిరి

నియోజకవర్గంలో వైసిపిని మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ పరిశీలకుడు సహదేవరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని మర్రికుంటపల్లి పంచాయతీలో వైసిపి నాయకుడు శివాజీ ఆధ్వర్యంలో డిసిఎంఎస్ ఛైర్మన్, నియోజకవర్గ పరిశోధకుడు సహదేవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అఫు మొహిద్దీన్ లు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కలికిరి, నగిరిపల్లిలోని సహకార బ్యాంకు మాజీ ఛైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో మహల్ ఎంపిటిసి ప్రదీప్‌రెడ్డి, సర్పంచ్ కాటాబాబు, నాయకులు ఎస్‌టిడి హరి, బావాజీ, జక్కివుద్దీన్, వెంకట రమణ రెడ్డి, దనుంజయ్, శివాజీ, గణేష్ పాల్గొన్నారు.


మాజీ సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న సురేంద్రరెడ్డి

మాజీ సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి సన్మానం


ప్రజాశక్తి-వీరబల్లి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేసిన నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డిని విఆర్‌డిఎస్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి కలికిరి ఆర్ అండ్‌బి అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ ఉమ్మడి రాష్ట్రంలో అవినీతి రహిత ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయ కులు సాయిలోకేశ్, గడ్డం చెంగల్‌రాజు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో జోరుగా ప్లాట్ల విక్రయాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణం సమీపంలో జగనన్న కాలనీలో పేదలకు కేటాయించిన ఇంటి స్థలాలు, ఇళ్ల అమ్మకాలతోపాటు ఆక్రమణలు జోరుగా జరుగుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని సిపిఐ మండల కార్యదర్శి సలీంబాషా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా నిరుపేదల కోసం అర్హులందరికీ ఇంటి స్థలాలను కేటాయించి పట్టాలను మంజూరు చేసిందన్నారు. జగనన్న కాలనీలో లక్ష రూపాయల నుంచి రూ.1.5 లక్షల చొప్పున అమ్ముకుంటు ఇదివరకే ఇంటి స్థలాలు ఉన్నవారికే స్థలాలు ఇచ్చారని, అందుకే అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. విచారణ చేపట్టి అనర్హులకు ఇచ్చిన ఇంటి స్థలాలు నిరుపేదలైన అర్హులైన వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు.


దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విద్యుత్ అధికారులు

ముమ్మరంగా విద్యుత్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి -నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో విద్యుత్ అధికారులు బుధవారం రెండవరోజు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఎఎఒ శివకు మారి, జెఎఒఎఎస్ శర్మ, యుడిసి విజయ భాస్కర్‌రెడ్డిల ఆధ్వ ర్యంలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిల పై తనిఖీలు నిర్వహించారు. వారి విద్యుత్ కనెక్షన్ తొలగించగా, విని యోగ దారులు దాదాపు లక్ష రూపాయల బకా యిలను చెల్లించి, కనెక్షన్లను పునరుద్ధ రించు కున్నారు. కార్యక్రమంలో ఎఇ బాలసుబ్రమణ్యం, ఫీల్డ్ అసిస్టెంట్లు రాజా, గోపి, రామ్మోహన్, లైన్‌మెన్ శ్రీరామ్, కిరణ్ కుమార్, జెఎల్‌ఎం కృష్ణ పాల్గొన్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు టిడిపి, వైసిపి ద్రోహం

మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

రాష్ట్ర విభజన అనంతరం మొదట అధికారం లోకి వచ్చిన టిడిపి, ప్రస్తుతం అధికారంలో వైసిపిలు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు తీరని ద్రోహం చేశాయని మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చిత్తూరు జిల్లాలో తాగునీటి కొరకు కండలేరు ప్రాజెక్టు నుంచి హంద్రీనీవా ద్వారా జిల్లాకు నీరు అందించడానికి రూ.7,400 కోట్లు కేటాయించానని తెలిపారు. మొదటి విడతలో రూ.6 వేల కోట్లు మంజూరు చేశానన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు ఆ పథకంను మూలనపడేసారని పేర్కొన్నారు. ప్రస్తు తం అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం కూడా కండలేరు ప్రాజెక్టును పట్టించు కోలేదని విమర్శించారు. ఆ ప్రాజెక్టు పూర్తయి ఉంటే 6.61 టిఎం సిల నీరు జిల్లాలో సాగు, తాగునీటికి అందేదని అన్నారు. నిమ్స్ కొరకు పది వేల ఎకరాలు భూమిని సేకరించి ఇండస్ట్రియల్ పార్కుకు ఏర్పాటు చేయ డానికి పార్లమెంటులో ఆమోదం తెప్పిస్తే దాన్ని మార్చడానికి చంద్రబాబు ప్రయత్నం చేశారని, ప్రస్తుత వైసిపికి కూడా పట్టించుకోలేదన్నారు. నియోజక వర్గంలో పారిశ్రామిక జోన్ ఏర్పాటు చేసివుంటే 30 వేల ఉద్యోగాలు వచ్చేవని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలోనూ, సమస్యలు పరిష్కారానికి శాశ్వత ప్రణాళికలు చేయడంలో రెండు పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎవి.సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేంద్రకుమార్‌రెడ్డి, మండల కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

ఓటర్ల సర్వేను త్వరగా పూర్తి చేయాలి : డిఆర్‌ఒ


గాలివీడు : ఓటరు జాబితాను పరిశీలిస్తున్న డిఆర్‌ఒ సత్యనారాయణరావు

ప్రజాశక్తి-గాలివీడు

ఓటరు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డిఆర్‌ఒ సత్యనారాయణరావు బిఎల్‌ఒలకు సూచించారు. బుధవారం మండలంలోని గాలివీడు, గోరాన్ చెరువు గ్రామ పంచాయతీలోని కుమ్మరపల్లెలో 175, 179,184,202 పోలింగ్ కేంద్రాల ఓటరు జాబితాను ఆయన పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రెండు ప్రాంతాల్లో ఓటు ఉన్న, చనిపోయిన వారి పేర్లను తొలగించాలన్నారు.18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కుపై అవగాహన కల్పించి ఓటుకు దరఖాస్తు చేయించాలన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాలో తప్పొప్పులను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ బాలాజీ, విఆర్‌ఎలు, బిఎల్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** ఇంటింటా ఓటరు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ డిప్యూటీ కలెక్టర్ సందీప్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నగర పంచాయతీ పరిధిలోని పోకనాటివీధి,పిటియం రోడ్డు, పంచాయతీ వీధి,దిగువ బస్టాండ్ పరిసరాలలో డివిజనల్ డెవలప్మెంట్ అధికారి లక్ష్మీపతి, తహశీల్దార్ రఫిక్ అహ్మదులతో కలిసి గడప గడపకు వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించారు. జాబితాలో మరణించిన వారి వివరాలను వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి మరణించిన వారి సమాచారాన్ని అడిగి ఓటర్ల లిస్టును పరిశీలిస్తూ మరణించిన వారిని ఫామ్-7 ప్రకారం మాత్రమే తొలగించాలని దానికి మరణ ధ్రువీకరణ పత్రం జతచేయాలని బిఎల్‌ఒలకు సూచనలు,సలహాలను ఇచ్చారు. రాబోవు ఎన్నికలలో తప్పులు లేని జాబితానే ఏకైక లక్ష్యంగా ఓటర్ జాబితా తయారు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఆర్.ఐ.శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

నవరత్నాలతో సంక్షేమ లబ్ధి : 'గడికోట'

ప్రజాశక్తి-రామాపురం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలతో సకల జనుల సంక్షేమం జరుగుతోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పాల్గొన్నారు. కర్ణపువాండ్లపల్లె, జగనన్నకాలనీ, రామాపురం, బి. రాచపల్లె, దళితవాడలలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతు న్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందరి వారు స్థానిక గ్రామ సచివాలయంలో సంప్రదించాలన్నారు. పేదరికం నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు వారి ఇంటి వద్దకే పింఛన్‌ను అందిస్తున్నామన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కూడా ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆంధ్రప్రదేశ్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. ఇతర రాష్ట్రాలు మన రాష్ట్రం వైపు చూస్తున్నాయని అన్నారు. సిఎం జగన్ సంక్షేమ పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయని అన్నారు. కార్యక్ర మంలో మాజీ ఎంపిపి, మండల కన్వీనర్ గడికోట జనార్ధన్‌రెడ్డి, జెడ్‌పి టిసి మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కర్ణపు విశ్వనాధ రెడ్డి, సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి, యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరం వెంకట సుబ్బారెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, స్థానిక నాయకులు చెన్నారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భక్త వత్సలరెడ్డి, సత్యాయాదవ్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

త్వరితగతిన విద్యుత్ సౌకర్యం కల్పించాలి : ఎంపిపి


విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న ఎంపిపి

ప్రజాశక్తి-కలకడ

జగనన్న కాలనీలలో విద్యుత్ సౌకర్యం త్వరితగతిన ఏర్పాటు చేయాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ సూచించారు .మండలంలోని బాటవారిపల్లె పంచాయతీ అక్కన్నగారికోటకు వెళ్లే దారిలో నిర్మిస్తున్న జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో లబ్ధిదారులు పనిబందులు గురవుతున్నట్లు తెలిపారు. జగనన్న లేఅవుట్‌లో త్వరగా విద్యుత్ సరఫరా పనులు త్వరగా చేపట్టాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, తీగలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఎఇ వరప్రసాద్‌ను కోరారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులు త్వరగా చేయాలని సూచించారు. ట్రాన్స్‌కో ఎఇ మీటర్లకు దరఖాస్తు చేయమని లబ్ధిదారులను కోరారు. కార్యక్రమంలో లైన్ మాన్ కిరణ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పల్లెబాట

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పల్లె బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్ తెలిపారు. బుధవారం జుంజరపెంట పంచాయతీలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. బురుజుపల్లెలో సిసిరోడ్డు ను ప్రారంభించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కృషి ఫలితంగా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని చెప్పారు. ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం రెండు కళ్లుగా వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అమలుపరిస్తూ ప్రజల మన్ననలు పొందుతు న్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూదేవి, చిన్నరాయుడు, ఎంపిపి అనసూయమ్మ, మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి, సింగల్ విండో ఛైర్మన్ భార్గవరెడ్డి, ఎంపిడిఒ సురేంద్రనాథ్, ఎపిఒ అంజనప్ప, ఎపిఎం గంగాధర్, రమణారెడ్డి, మల్లికార్జున, కోటిరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.


పల్లెబాట కార్యక్రమంలో వైసిపి నాయకులు


నినాదాలు చేస్తున్న ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు

మాదిగల విశ్వరూప సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఎస్‌సి వర్గీకరణ కోసం ఎంఆర్‌పిఎస్ చేపట్టిన విశ్వరూప మహాసభలు జయప్రదం చేయాలని ఎంఎస్‌సి నాయకులు దుమ్ము చిన్న కోరారు. మండలంలోని జుంజరపెంటలో మాదిగలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ కోసం హామీనిచ్చి తుంగలో తొక్కిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగల అభివృద్ధి కోసం మాదిగలందరూ ఏకమై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మాదిగలు ఆర్థికంగా రాజకీయంగా సామాజిక పరంగా అన్ని రకాల వెనుకబడి పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి వర్గీకరణతోనే అభివృద్ధి చెందుతామన్నారు. ఎస్‌సి వర్గీకరణ సాధించేంత వరకు ఉద్యమాన్ని ఆపేలేదని స్పష్టం చేశారు. ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములైన విశ్వరూప సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి నాయకుల వెంకటప్ప ,మల్లికార్జున, రమణప్ప, గంగులప్పా, తిప్పన్న, సోమశేఖర్, శ్రీనివాసులు, మంగమ్మ, భారతి, అమరావతి పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-పీలేరు

తమ పల్లెకు ఓ శ్మశాన వాటిక అవసరమని దాని ఏర్పాటుకు స్థలం కేటాయించాలంటూ పీలేరు మండలం, దొడ్డిపల్లె పంచాయతీ, అన్నంగి దళితవాడ ప్రజలు అధికారులకు కోరారు. తహశీల్దారు ధనంజయులు ఆధ్వర్యంలో బుధవారం అన్నంగి దళితవాడలో మానవ హక్కుల దినం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ ఊరికి ప్రత్యేక స్మశానవాటిక లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. స్పందించిన తహశీల్దార్ వెంటనే ప్రభుత్వ భూములు గుర్తించి శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని విఆర్‌ఒ సురేష్‌రెడ్డిని ఆదేశించారు. గ్రామంలో బోరు కూడా ఎండి పోవడంతో తాగునీటికి ఇక్కట్లు తెలుపగా సంబంధిత శాఖాధికారుల ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామంలో సమస్యలపై గ్రామస్తులు వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు సుభాష్, మల్లిఖార్జున, సుధాకర్, ధరణీ, సర్పంచ్ సుబ్బులుమ్మ, ఎంపిటిసి శ్యామలమ్మ పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దళితవాడ ప్రజలు


అజయ్‌బాబును సన్మానిస్తున్న కరీం, ముజఫర్ అహ్మద్

ఉర్దూ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా అజయ్‌బాబు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా నందవరం అజయ్‌బాబు బుధవారం బాధ్యతలను చేపట్టారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల కమిటీ ఛైర్మన్ ఎస్ఎండి కరీం, ముస్లిం మైనార్టీ నాయకులు ముజఫర్‌అహ్మద్, ఎస్.జి ఇనాయతుల్లా, రహిమాన్, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది అజయ్‌బాబును సాదరంగా ఆహ్వానించి పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని విద్యా, బుద్ధులు నేర్చుకోవాలని అన్నారు. కళాశాల అధ్యాపక బృందం సమిష్టిగా ఐకమత్యంతో కృషి చేసి ఈఏడాది సార్వత్రిక పరీ క్షలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి కళాశాలను ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు.


ఆర్‌డిఒకు వినతి పత్రం అందిస్తున్న సయ్యద్ అమీర్

ఉపాధి కోసం వెళ్లిన వారి ఓట్లు తొలగించొద్దు

ప్రజాశక్తి-నందలూరు

జీవనోపాధి కోసం ఇతర దేశాలకు వెళ్ళిన వారి ఓట్లు తొలగించవద్దని రాజంపేట ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డిని జిల్లా వక్ఫ్‌బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్ కోరారు. బుధవారం నందలూరుకు వచ్చిన ఆర్‌డిఒకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అమీర్ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగు తున్న ఓటర్ల పరిశీలనలో కొంతమంది మైనార్టీ ఓటర్లను టార్గెట్ చేసి, వారి ఓట్లు తొలగించాలని బిఎల్‌ఒలకు, తహశీల్దార్‌లకు విన తులు అందించారని అన్నారు. సమస్యను విన్న ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి పారదర్శకంగా ఓటరు జాబితాను పరిశీలించి తగు న్యాయం చేస్తామని చెప్పారని అమీర్ తెలిపారు.

ఆలయానికి రూ.35 వేలు విరాళం

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని గొరాన్‌చెరువు దళితవాడలో నూత నంగా నిర్మిస్తున్న రామాలయం దేవాలయ నిర్మాణనికి కసిరెడ్డి శివారెడ్డి రూ.35వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి కాదనకుండా శివారెడ్డి తన దాతృత్వాన్ని చాటుకుంటున్నారని అన్నారు. యువతకు క్రీడలో ముందుకు తీసుకెళ్లేందుకు క్రీడా పరికరాలు, యూనిఫాం అందిస్తూ ప్రొత్సహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు వెంకటాద్రి, శివగంగిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నవాజ్, క్రిష్ పాల్గొన్నారు.


విరాళం అందిస్తున్న కసిరెడ్డి శివారెడ్డి

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని చిట్వేలి-కడప, చెన్నై రోడ్డుకు అనుసంధానమైన రోడ్డుకు ఇరు వైపులా ఆక్రమణ భవనాలను బుధవారం తహశీల్దార్ నరసిం హాకుమార్ ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు లోబడి ఆక్రమణలను తొలగించినట్లు చెప్పారు. రోడ్డు విస్తరణలో భాగంగా భవనాలను తొలగించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆక్రమణలను తొలగిస్తున్న జెసిబి

అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

నందలూరు : రాష్ట్ర ప్రభుత్వం అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ అన్నారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు విజయవాడలో ఉన్న గనులు, భూగర్భ డైరెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడానికి వస్తే తనను నన్ను విజయవాడ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి విజయవాడ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుక పోవడం దారుణమన్నారు. ఇటువంటి అరెస్టులతో ఉద్యమం ఆపలేరని అన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో డబ్బును ప్రజలకు పంచి మళ్లీ అధికారంలోకి రావాలని వైసిపి చూస్తోందని, వైసిపి నాయకులు ఎన్ని కుయుక్తులు పడినా ప్రజలు ఎవరికి ఓటు వేయాలో ఇప్పటికే నిర్ణయించుకున్నారని అన్నారు.

క్రైం కార్నర్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కేశప్ప

ముగ్గురు గంజాయి నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముగ్గురు గంజాయి నిందితులు అరెస్టు చేసి వారి నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాదీనం చేసుకున్నట్లు డిఎస్‌పి కేశప్ప తెలిపారు. పట్టణంలోని స్థానిక టూటౌన్ పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మదనపల్లి పరిసర ప్రాంతాలలో గంజాయి, తాగుడుకు అలవాటు పడ్డారని, విశాఖపట్నం జిల్లా మన్యం అడవుల నుంచి గంజాయిని దొంగ చాటుగా తీసుకువచ్చి అధిక ధరలకు అమ్ముతున్నారని చెప్పారు. రాబడిన సమాచారం మేరకు రూరల్ సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సిటిఎం రైల్వే స్టేషన్ మసీదు ప్రాంతంలో గంజాయి సంచులతో నిలబడిన నలుగురు వ్యక్తులలో పోలీసులను చూసి ఒక వ్యక్తి పారిపోగా, ముగ్గురు నిందితులు అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులు ఉమాశంకర్, ఉదయ్‌కిరణ్, హరినాధలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పరారైన పకాష్ కోసం గాలింపు చర్యలు చేపట్టామని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.